జెండా ఆవిష్కరణ

జగిత్యాల టౌన్, అక్టోబర్ 13: జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్‌లో గల ధర్మస్థలి వద్ద విజయ దశమిని పురస్కరించుకొని విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కాషాయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ పట్టణాధ్యక్షుడు జెట్టవేణి అరుణ్‌కుమార్, జిల్లా సహ కార్యదర్శి గాజోజు సంతోష్, భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, వీహెచ్‌పీ జిల్లా కోశాధికారి రాములు, నగర కార్యదర్శి పరంధాము, బజరంగ్‌దళ్ సభ్యులు పాదం మహేందర్, భూమేశ్, రాజమల్లయ్య, లింగంపేట శ్రీనివాస్, వేముల సంతోష్, సంపూర్ణచారి, అనురాధ, అరువ లక్ష్మి, మాడిశెట్టి మల్లేశం, కస్తూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల నియామకానికి నోటిఫికేషన్

ధర్మపురి, అక్టోబర్ 13: ధర్మపురి మండలంలోని అక్కపల్లి రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వంశపారంపర్యం కాని ధర్మకర్తల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆసక్తి గల వారు 20 రోజుల్లో నిర్ణీత ఫారం-11లో పూర్తి వివరాలు పూరించి దేవాదాయశాఖ కమిషనర్ హైదరాబాద్‌కు లేదా సహాయ కమిషనర్ కరీంనగర్‌కు లేదా ధర్మపురి దేవస్థానం కార్యనిర్వహణాధికారికి పంపాలని ఈవో శ్రీనివాస్ తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల కమిటీల నియామకం

పెగడపల్లి, అక్టోబర్ 13: పెగడపల్లి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను నియమిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో గ్రామ ప్రత్యేకాధికారి చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా, మహిళా సంఘాలకు చెందిన ఇద్దరు, గ్రామస్తుల్లో ఎస్సీ, ఎస్టీ నుంచి ఒకరు, బీసీల నుంచి ఒకరు, ఇతరులు ఒకరిని నియమించనున్నట్లు తెలిపారు. ఈ కమిటీల ద్వారానే గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు.

మహిషాసుర దహన ఏర్పాట్లు చేస్తూ..

- కరెంట్ షాక్‌తో డిష్ ఆపరేటర్ మృతి
- పండుగ పూట రాగోజీపేటలో విషాదం

మేడిపల్లి, అక్టోబర్ 13 : మహిషాసురుడి దహనానికి ఏర్పాట్లు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఒకరు అక్కడికక్కడే మృతిచెందాడు. భీమారం మండలం రాగోజీపేటలో దసరా పండుగ పూట విషాదం నింపిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాగోజీపేటకు చెందిన అరిసెల్ల వెంకటేశం(36) కేబుల్ డిష్ ఆపరేటర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. దసరా పండుగ సందర్భంగా శనివారం దుర్గాదేవీ విగ్రహం నుంచి మహిషాసురుని విగ్రహం వరకు వైర్ అమర్చే సమయంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రమాదవశాత్తు తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా, పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. దసరా పండుగ రోజు వెంకటేశం మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వెంకటేశంకు భార్య సరిత, కూతురు ఆద్య, కొడుకు ఆర్యన్ ఉన్నారు. వెంకటేశం భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★ I, Mohammad husamoddin (Old Names) S/o. Mohammad Ekramoddin, R/o.H.No.6-4-101, Street : Arfathpura, Mandal: KORATLA-505326, District Jagtial, Telangana, Have Changed My Name as MOHAMMAD HUSSAM UDDIN

NTK-325721

కావలెను

★ మ్యారేజ్ బ్యూరో నందు పని చేయుటకు అమ్మాయి కావాలి. చదువుతో నిమిత్తం లేకుండా మంచి వాక్చాతుర్యం గల నమ్మకంతో పర్మినెంట్‌గా పనిచేసే అమ్మాయి కావలెను. సంప్ర|| సెల్: 8341220970

NTK-335282

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189

రెవెన్యూ వర్సెస్ మున్సిపల్ కమిషనర్

- దసరా జమ్మి సాక్షిగా బయటపడ్డ ఆధిపత్య పోరు
- జమ్మి వృక్షం తెచ్చేందుకు ట్రాక్టర్ ఇచ్చేది లేదంటూ కమిషనర్ హుకుం జారీ
- గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో తీసుకొచ్చిన రెవెన్యూ అధికారులు
- పలు అంశాల్లో కమిషనర్, పురపాలక సభ్యుల మధ్య విభేదాలు
- బతుకమ్మ ఏర్పాట్లలోనూ కమిషనర్, చైర్‌పర్సన్ మధ్య పొరపొచ్చాలు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన మహిళా కౌన్సిలర్

జగిత్యాల జంబిగద్దె వద్ద మోతె గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో తెచ్చిన జమ్మి వృక్షం

జగిత్యాల, అక్టోబర్ 13(నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రంలో కొద్ది రోజులుగా జిల్లా రెవెన్యూ వర్సెస్ జగిత్యాల మున్సిపల్ కమిషనర్ అన్నట్లుగా వ్యవహారం సాగుతోంది. ఒకరు ఆదేశాలు ఇస్తే మరొకరు 'అలాంటి ఆదేశాలు నేను అమలు చేయలేను. నాకు ఉత్తర్వులు లేవు' అంటూ మున్సిపల్ కమిషనర్ సమాధానం చెబుతుండగా, 'ఉన్నతాధికారులు ఇచ్చే ఆదేశాలు కచ్చితంగా పాటించాల్సిందే' అంటూ రెవెన్యూ అధికారులు పేర్కొంటూ, వారికి ఉన్న అధికారాలను చూపిస్తుండడంతో రసవత్తర రాజకీయం నడుస్తున్నది. వారం క్రితం కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి కలెక్టర్ హోదాలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నిర్వహించిన ప్రజావాణిలో మున్సిపల్ కమిషనర్ ఆలస్యంగా వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేయగా, 'దీంతో కమిషనర్.. 'నేను గ్రూప్ -1 ఆఫీసర్‌ను. నేనేం ఊరికే లేను. ఎమ్మెల్యేతో సమావేశంలో ఉన్న. అందుకే ఆలస్యం జరిగింది' అంటూ బాహాటంగా, ఆగ్రహంతో సమాధానం చెప్పడం సంచలనం సృష్టించింది. ప్రజావాణి వేదికపైనే రెవెన్యూ, లోకల్ బాడీలకు చెందిన ఇద్దరు అదనపు కలెక్టర్లతో పాటు, జగిత్యాల ఆర్డీవోతోనూ మున్సిపల్ కమిషనర్ వాదనకు దిగడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ వ్యవహారం దరిమిలా, రెవెన్యూ, కమిషనర్ మధ్య ఆధిపత్యపోరు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. కమిషనర్ రెవెన్యూ అధికారులతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్, పాలకవర్గంతో సైతం అదే రీతిలో వ్యవహరిస్తుండడంతో పలు వివాదాలు చోటు చేసుకుంటున్నట్లు సమాచారం.

జమ్మి సాక్షిగా బయటపడ్డ అంతర్గత కుమ్ములాటలు..

దసరా పర్వదినం సందర్భంగా జమ్మి చెట్టు సాక్షిగా రెవెన్యూ, మున్సిపల్ కమిషనర్ మధ్య నెలకొన్న విభేదాలు బయటపడ్డాయి. జిల్లా కేంద్రంలో దశాబ్దాలుగా దసరా సందర్భంగా జమ్మిచెట్టుకు శమీ పూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శమీపూజ కోసం ప్రత్యేక వేదిక ఏర్పాటు ఏ పట్టణంలోనూ లేదు. ఉమ్మడి రాష్ట్రంలో విజయవాడ, తర్వాత జగిత్యాలలోనే శమీపూజ నిర్వహణ కోసం జంబిగద్దెను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. జగిత్యాల పట్టణంలో దాదాపు 160 ఏండ్ల క్రితమే శమీపూజ కోసం జంబిగద్దెను ఏర్పాటు చేసినట్లు చరిత్ర చెబుతోంది. దసరా పర్వదినం రోజున జంబిగద్దెను అందంగా అలంకరించడంతో పాటు గ్రామీణ ప్రాంతం నుంచి శమీవృక్షాన్ని వాహనంలో తీసుకువచ్చే కార్యక్రమాన్ని మున్సిపాలిటీ నిర్వహిస్తూ వస్తోంది. శమీ పూజ అనంతరం జంబి కొట్టే ఆచారాన్ని మొదట్లో తహసీల్దార్లు, తర్వాత ఆర్డీవోలు, జిల్లా కేంద్రంగా అవతరించిన తర్వాత కలెక్టర్లు చేపట్టడం ఆనవాయితీగా మారింది. దసరా పండుగకు ఒక్కరోజు ముందే జగిత్యాల రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌కు ఫోను ద్వారా, జంబిగద్దె వద్ద ఏర్పాట్లు చేయాలని, శమీ వృక్షం తీసుకువచ్చేందుకు మున్సిపల్ సిబ్బందిని, ట్రాక్టర్‌ను గ్రామీణ ప్రాంతానికి పంపాలని పేర్కొనడంతో, తనకు ఏర్పాట్లు చేయాలన్న నిబంధనలు లేవని, కమిషనర్ తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. దీంతో దశాబ్దాల నుంచి జరుగుతున్న ఆనవాయితీని పాటించాలని రెవెన్యూ, పురపాలక సంఘ సభ్యులు, చైర్‌పర్సన్ కోరినా, కమిషనర్ ససేమిరా అనడంతో పాటు సిబ్బంది ఎవరైనా తన మాటను కాదని వెళ్తే సస్పెండ్ చేస్తానని, ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో విధి లేని పరిస్థితిలో జగిత్యాల సమీపంలో ఉన్న మోతె గ్రామ పంచాయతీ సిబ్బందికి చెప్పి, గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో శమీ వృక్షాన్ని రెవెన్యూ అధికారులు తెప్పించి, ఏర్పాట్లు చేసుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.

మహాబతుకమ్మ ఏర్పాట్లలో నిర్లక్ష్యం..

బతుకమ్మ పండుగ సందర్భంగా జగిత్యాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మహా బతుకమ్మను ఏర్పాటు చేయడం గత పదేండ్లుగా ఆనవాయితీగా వస్తోంది. పాలకవర్గంలో ఎవరు ఉన్న మహాబతుకమ్మ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ సారి సైతం పాలకవర్గం ఏర్పాట్లు చేసింది. అయితే పాలకవర్గం తీసుకున్న నిర్ణయాన్ని అమలు పరిచి, ఏర్పాట్లు పర్యవేక్షించాల్సిన కమిషనర్ పట్టనట్లు వ్యవహరించారని, పాలకవర్గం తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాల్సిన అవసరం తనకు లేదని, తాను ఎలాంటి ఏర్పాట్లు చేయలేనని, మున్సిపల్ సిబ్బందికి సైతం ఏర్పాట్ల విషయంలో ఆదేశాలు ఇవ్వలేనని పాలకవర్గం, చైర్‌పర్సన్‌కు తేల్చిచెప్పడంతో పాలకవర్గం ఖంగుతిన్నట్లు తెలుస్తోంది. అలాగే, బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణ ప్రముఖులు, పాలకవర్గ సభ్యులను శాలువాలు, మెమొంటోలతో సన్మానించేందుకు పాలకవర్గం నిర్ణయించగా, మెమొంటోలు సైతం తెప్పించేందుకు కమిషనర్ సుముఖత వ్యక్తం చేయనట్లు తెలుస్తోంది. బతుకమ్మ సంబురాల నుంచి సైతం కమిషనర్ అర్ధాంతరంగా వెళ్లిపోయి తమను అవమానించినట్లుగా కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమిషనర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌పై పట్టణానికి చెందిన కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ ఆదివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శమీ పూజ, మహాబతుకమ్మ ఏర్పాట్లలో నిర్లక్ష్యంతో పాటు పలు అంశాలను ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాబతుకమ్మ వేడుకల నిర్వహణ ఏర్పాట్ల కోసం నిర్వహించిన టెండర్లలో 28.99 శాతం తక్కువకు టెండర్ కోట్ చేసిన గుత్తేదారుకు, జీఎస్టీ లేదన్న సాకును చూపుతూ, పనులు అప్పగించని కమిషనర్, అదే రోజు నిర్వహించిన మరో టెండర్‌లో అదే గుత్తేదారుకు జీఎస్టీని పరిగణలోకి తీసుకోకుండా, టెండర్ ఓకే చేశారని ఆమె ఆరోపించారు. టెండర్ల విషయాలు నోటీసు బోర్డులో పెట్టకుండా, తనకు నచ్చిన గుత్తేదారులకు అప్పగించుకుంటున్నారని పేర్కొన్నారు. కమిషనర్ నిబంధనలకు విరుద్ధంగా సొంత కారును వాడుతూ, దానికి మున్సిపల్ నుంచి డబ్బులు తీసుకుంటున్నారని, అలాగే మున్సిపాలిటీలో మ్యుటేషన్లతో పాటు ఇతర రెవెన్యూ అంశాల్లోనూ అవకతవకలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలోనూ కమిషనర్ సిబ్బందితో కలిసి అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. టవర్ సర్కిల్ వద్ద వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదు చేస్తే కమిషనర్ తనకు టవర్ తెలువదని వ్యంగ్యంగా మాట్లాడినట్లు చెప్పారు. ్లడుతూ, రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరుతూ, రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన తర్వాత వాటిని బుట్టదాఖలు చేస్తున్నాడని, కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో కోరారు.

ఘనంగా దసరా వేడుకలు

మారుతీనగర్: మెట్‌పల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శమీ పూజ చేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు దంపతులు

ధర్మపురి/జగిత్యాల టౌన్/రాయికల్/కోరుట్ల/మారుతీనగర్/మేడిపల్లి/పెగడపల్లి/మెట్‌పల్లిరూరల్/కొడిమ్యాల/కోరుట్ల రూరల్/కథలాపూర్/ఇబ్రహీంపట్నం/మల్యాల/సారంగాపూర్/మల్లాపూర్, అక్టోబర్ 13: జిల్లా వ్యాప్తంగా ప్రజలు శనివారం దసరా వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. కాగా, జగిత్యాల పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయం నుంచి పల్లకీ సేవ ఊరేగింపుగా జంబిగద్దె వద్దకు చేరుకోగా అదనపు కలెక్టర్ రాంబాబు శమీ పూజ నిర్వహించారు. నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో జంబిగద్దె వద్ద మహిషాసుర మర్దిని కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి-లక్ష్మణ్, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ దంపతులు, తహసీల్దార్ వరందన్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాయికల్ పట్టణంతో పాటు గ్రామాల్లో శమీ పూజ నిర్వహించారు. ప్రజలు ఒకరికొకరు జమ్మి ఆకు ఇచ్చి పుచ్చుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కోరుట్ల పట్టణంలోని వేంకటేశ్వర, మహదేవస్వామి, అయ్యప్ప జ్ఞానసరస్వతీ మాత, అష్టలక్ష్మీ, కోటి నవదుర్గా, త్రిశక్తి ఆలయాల్లో స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకార్చనలు నిర్వహించారు. సాయంత్రం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శమీ పూజ చేశారు. వేంకటేశ్వరాలయంలో నాటిన జమ్మి వృక్షానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి పల్లకీ సేవకు హాజరయ్యారు. ఎమ్మెల్యేను ఆలయ అధికారులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఇక్కడ ఆలయ ప్రధాన అర్చకులు బీర్నంది లక్ష్మీనర్సింహాచార్యులు, శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు విక్రమ్, నర్సయ్య తదితరులున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మహిషాసుర మర్దిని కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని చెన్నకేశవ, త్రిశక్తి, కోదండరామాలయం, అయ్యప్ప ఆలయాల్లో అయ్యప్ప ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు-సరోజన దంపతులు, ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల శమీ పూజలు చేశారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. అలాగే, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చైర్‌పర్సన్ రాణవేని సుజాత మున్సిపల్ వాహనాలకు వాహన పూజలు చేయగా, పోలీస్ స్టేషన్‌లో సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహన, ఆయుధ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో త్రిశక్తి ఆలయ కమిటీ సభ్యులు, భవానీ దీక్షాపరులు, దుర్గామాత మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు. మేడిపల్లి, భీమారం మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో దసరా పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. దుర్గాదేవీ నిమజ్జన కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు, మాజీ ఎంపీపీ దొనకంటి ఉమాదేవి, రాజరత్నాకర్‌రావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, సింగిల్ విండో మాజీ చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు. ధర్మపురి లక్ష్మీనరసింహా స్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దసరా ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం యోగ నారసింహస్వామి, ఉగ్ర నారసింహస్వామి, వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సేవపై ఉంచి ఊరేగింపుగా శమీ పూజ మండపానికి తీసుకెళ్లారు. శమీ వృక్షం కింద స్వామి వారి ఉత్సవమూర్తులను ఉంచి వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులు ఒకరికొకరు జమ్మి ఆకు ఇచ్చుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం స్వామి వారి సేవ తిరిగి ఆలయానికి చేరుకోగా భక్తులు పల్లకీ సేవ వెంట పరుగులు తీశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, నాయకులు దినేశ్, చిలుముల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. సనాతన ఆచార సంప్రదాయం ప్రకారం విజయ సూచికగా ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ మహేశ్ 303 తుపాకీతో గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. ధర్మపురి క్షేత్రంలో అనాధిగా ఈ సంప్రదాయం వస్తూ ఉన్నది. పెగడపల్లి మండలంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. మండలంలో ఎస్ఐ రవి కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కోరుట్ల, కథలాపూర్ మండలాల్లో నిర్వహించిన వేడుకల్లో మాజీ ప్రజాప్రతినిధులు, కుల సంఘాల, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. జగిత్యాలలోని అష్టలక్ష్మీ ఆలయ ఆవరణలో కనక దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో మహిషాసుర సంహారం చేశారు. అనంతరం దుర్గామాత అమ్మవారిని టవర్ సర్కిల్ మీదుగా ఊరేగింపుగా తీసుకెళ్లి మోతె తటకంలో నిమజ్జనం చేశారు. మెట్‌పల్లి మండలంలోని గ్రామాల్లో దసరా పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. వెల్లుల్ల శివారులోని దసరా గుట్టపై గల ప్రహ్లాద సహిత లక్ష్మీనృసింహస్వామిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శమీ వృక్షానికి పూజలు నిర్వహించగా, యువకులు ఉత్సాహంగా జమ్మికొట్టారు. లక్ష్మీనృసింహ స్వామిని అశ్వవాహనంపై గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కొడిమ్యాల మండలం నల్లగొండలో లక్ష్మీనృసింహ స్వామి విగ్రహాలను ఊరేగించారు. పూడూర్‌లో దుర్గామాత శోభాయాత్ర నిర్వహించారు. సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్ఐ సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మల్యాల, సారంగాపూర్, మల్లాపూర్ మండలాల ప్రజలు దసరా పండుగను ఘనంగా జరుపుకొన్నారు. కాగా, మల్యాల మండలం కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో శమీ పూజ నిర్వహించడంతో పాటు ఉత్సవ మూర్తులకు గరుడ సేవ నిర్వహించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 13: మెట్‌పల్లి పట్టణంలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మెట్‌పల్లి పట్టణానికి చెందిన కట్కూరి రాజు ఈనెల 4న కుటుంబ సభ్యులతో కలిసి సచ్చిదానంద స్వామి ఆశ్రమానికి వెళ్లారు. తిరిగి ఆదివారం ఇంటికి చేరుకున్న రాజుకు ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడేసి కనిపించాయి. బీరువాలో భద్రపరిచిన నాలుగు తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. సమాచారమందుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ చిరంజీవి ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళా ప్రయాణికులకు పెన్నుల పంపిణీ

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 13: మెట్‌పల్లి పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నందున స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులకు మెట్‌పల్లి డిపో మేనేజర్ దేవరాజు పెన్నులు పంపిణీ చేశారు. ఆర్టీసీలో మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

కోరుట్ల రూరల్, అక్టోబర్ 13 : వెంకటాపూర్ గ్రామ శివారులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తనయుడు ఆది కార్తీక్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ ఆలయ కమిటీ అధ్యక్షుడు కట్కం రాజేశ్, నాయకులు రమేశ్, చిట్టిబాబు, మహ్మద్ సమీ, గంగాధర్, పాషా, రాజిరెడ్డి తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మేడిపల్లి, అక్టోబర్ 13: భీమారం మండలం రాగోజీపేట గ్రామానికి చెందిన అరిసెల్ల వెంకటేశం, వెంకట్రావుపేటకు చెందిన కొత్తకొండ కాశీరాములు మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులను ఆదివారం జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బాలసాని లహరిక, మారుతిగౌడ్, టీఏవైఎస్ భీమారం మండలాధ్యక్షుడు బంగారు దీపక్, నాయకులు దువ్వాస నారాయణ, కల్లెం జలంధర్, పొన్నం లక్ష్మీనారాయణ, ఏనుగంటి రాజేశ్, కడతల వెంకటేశ్, బూస రాకేశ్, అజయ్‌కుమార్ తదితరులున్నారు.

ఇడ్లీలో జెర్రీ

జగిత్యాల, అక్టోబర్ 13: జిల్లా కేంద్రంలో తహసీల్ చౌరస్తాలో గణేశ్ భవన్ ఉడిపి హోటల్‌లో ఓ మహిళ ఇడ్లీ ఆర్డర్ చేసి తింటుండగా, అందులో జెర్రీ కనిపించింది. ఇది ఆరోగ్యానికి ప్రమాదకరమని ఆమె హోటల్ ఎదుట ఆందోళనకు దిగింది. ఈ సంఘటన స్థానిక ప్రజలను కలవరపెట్టడంతో పాటు హోటల్ నిర్వాహకుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హోటల్ యాజమాన్యం ఇడ్లీలను బల్దియా ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా బాధితురాలు, స్థానికులు అడ్డుకున్నారు. ఈ ఘటనలో మున్సిపల్ అధికారులు హోటల్‌కు వచ్చి రూ.3వేలు జరిమానా విధించారు. ఈ ఘటనలో హోటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కాగా, మహిళ ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు హోటల్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు.

అంజన్నను దర్శించుకున్న న్యాయమూర్తి

మల్యాల, అక్టోబర్ 13: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో కరీంనగర్ సెషన్స్ కోర్టు ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి నీరజ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కొండగట్టుకు వచ్చిన న్యాయమూర్తికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ప్రాకార మండపంలో స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేయగా అర్చకులు ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకుడు హరిహరనాథ్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు అశోక్, దర్మేంధర్, స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకుడు రామకృష్ణ, ఉపప్రధాన అర్చకుడు చిరంజీవస్వామి, అర్చకులు మారుతీప్రసాద్, జితేందర్, వేద పండితులు పెద్దన్నశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయ దశమి విజయాలు చేకూర్చాలి

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 13: విజయదశమి పండుగ ప్రజలకు అన్ని రంగాల్లో విజయం చేకూర్చాలని ఎస్పీ అశోక్ కుమార్ ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో గల ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో శనివారం ఆయన ఆయుధ, వాహన పూజ చేశారు.

ఇరువర్గాలపై కేసు

సారంగాపూర్, అక్టోబర్13: మండలంలోని రేచపల్లి గ్రామంలో దసరా సందర్భంగా శనివారం రాత్రి ఇరువర్గాల మధ్య గొడవ జరినట్లు ఎస్ఐ దత్తాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన బుర్ర రాజేశం, దీటి కొమురయ్య వర్గాల మధ్య గొడవ జరుగగా, ఇరువర్గాలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాయికల్, అక్టోబర్ 13: రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలో దసరా రోజు ప్రజలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గ్రామస్తులు రాయికల్-జగిత్యాల ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐలు సుధీర్ రావు, సధాకర్ ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

క్రీడాకారులకు సత్కారం

వెల్గటూర్, అక్టోబర్ 13: గుల్లకోట జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక కాగా, ముదుగంటి అనంతరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేసి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సైనికుడు ముదుగంటి వెంకటరమణా రెడ్డి, ముదుగంటి భాస్కర్ రెడ్డి, తహసీల్దార్ పొనగంటి నవీన్‌కుమార్, ఎస్ఐ వంశీ, ద్యావ మహిపాల్ రెడ్డి, లక్ష్మయ్య, మారుతి, మాజీ ఎంపీటీసీ గొల్లపల్లి మల్లేశం, అమరగుండ సత్యనారాయణ, పీడీ మహేశ్, పంచాయతీ కార్యదర్శి ఎండీ హఫీజ్, వెంకటేశ్, రమేశ్, ఒజ్జల మహేశ్, గుండ తిరుపతి, పాలకుర్తి సుభాష్, మడప వినయ్, క్రీడాకారులు మహేశ్, సాయికుమార్, అనూష, మౌనిక, సన, రోహిణి పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న ఆలయ ఉద్యోగికి మెమో

మల్యాల, అక్టోబర్ 13: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో పని చేస్తున్న ఓ ఉద్యోగికి ఆలయ అధికారులు మెమో జారీ చేసినట్లు ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. ఈవో తెలిపిన వివరాల ప్రకారం.. దేవస్థానంలోని నిత్యాన్నదాన సత్రంలో భక్తుల అవసరాలకు వినియోగించే నిత్యావసరాల వస్తువుల నిల్వల్లో వ్యత్యాసం ఉండడంతో పాటూ పలు వస్తువులు బయటకి తరలించారనే అనుమానంతో సీసీ పుటేజీలు పరిశీలించారు. నిత్యాన్నదాన సత్రంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగికి మెమోను జారీ చేసినట్లు తెలిపారు. మెమో జారీ చేసిన ఉద్యోగి వివరణ ఇచ్చాక పరిశీలించి, విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

వరద కాలువ భూమిపై వివాదం

కథలాపూర్, అక్టోబర్ 13: కథలాపూర్ మండలం దుంపేట గ్రామ శివారు గుండా వెళ్తున్న వరద కాలువ భూమి విషయంలో ఆదివారం కథలాపూర్, దుంపేట గ్రామాల ప్రజల మధ్య వివాదం నెలకొంది. ఇరువర్గాలు వరదకాలువ భూమి వద్దకు రాగా, గొడవ జరిగే అవకాశం ఉందని సమాచారం తెలుసుకున్న కోరుట్ల సీఐ సురేశ్ బాబు, కథలాపూర్, కోరుట్ల ఎస్ఐలు నవీన్‌కుమార్, శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాలతో సీఐ, ఎస్ఐ మాట్లాడి అక్కడి నుంచి పంపించారు.

అన్నా-చెల్లెను సన్మానించిన ఎమ్మెల్సీ

జగిత్యాల, అక్టోబర్ 13: రాయికల్ మండలం అలూర్ గ్రామానికి చెందిన లక్కం రిషిత, లక్కం మణిరాజ్ ఎవరెస్ట్ శిఖరం ఎక్కగా, ఇద్దరిని ఆదివారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఎన్నో విజయాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కండక్లు గంతలు కట్టుకొని నిరసన

మల్లాపూర్, అక్టోబర్ 13: సిరిపూర్ గ్రామంలోని సహకార సంఘంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంఘ కార్యాలయం ఆవరణలో అధ్యక్షుడు బద్ధం అంజిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి తొమ్మిదో రోజుకు చేరింది. దీంతో పాలకవర్గ సభ్యులు దీక్ష శిబిరం వద్ద కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఇక్కడ వైస్‌చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవీ లడ్డూ వేలం

మేడిపల్లి, అక్టోబర్ 13: భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామంలో దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి చేతిలో పెట్టిన లడ్డూ వేలం పాట నిర్వహించగా, వేముల మల్లికార్జున్-వజ్ర దంపతులు రూ. 50 వేల 16కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి, కాటిపల్లి జగన్‌రెడ్డి, సుదవేని భూమేశ్‌గౌడ్, అంగడి ఆనంద్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా పుణ్యతిథి వేడుకలు

కోరుట్ల, అక్టోబర్ 13: పట్టణంలోని సాయిరామ ఆలయంలో ఆదివారం షిర్డీ సాయిబాబా పుణ్యతిథి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి వేద పండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకార్చనలు, కాగడహారతి, అలయ సంకీర్తన, అభిషేకం, పతాకారోహణ, కలశాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు జరిపించారు. సాయిబాబాను దర్శించుకున్న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పుణ్యతిథి వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు వడ్డన చేశారు. వేడుకల్లో ఈవో కాంతారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్, అక్టోబర్ 13 : కోరుట్ల మున్సిపాలిటీలో విలీనమైన ఏకీన్‌పూర్ గ్రామంలో సాయిబాబా పుణ్యతిథి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండలాధ్యక్షులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, నాయకులు మురళి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మారుతీనగర్, అక్టోబర్ 13: పట్టణంలోని సాయిరాం కాలనీలో గల సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పుణ్యతిథి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథుడికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకార్చనలు చేపట్టారు. సాయినాథుడిని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్లతో పాటు ప్రజాప్రతినిధులు దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు రాణవేని సుజాత, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 13: మండలంలోని వెల్లుల్ల, జగ్గసాగర్, ఆత్మకూర్ గ్రామాల్లోని షిరిడీ సాయిబాబా ఆలయాల్లో పుణ్యతిథి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లోని సాయి ఆలయాల్లో ఉదయం అర్చన, అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం కాకడహారతి, సాయి పల్లకిసేవ జరిపారు. ఈ సందర్భంగా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకోగా, నిర్వాహకులు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఆత్మకూర్‌లోని షిరిడీసాయి బాబాకు కాంగ్రెస్ నాయకుడు గోవర్ధన్ వెండి కిరీటాన్ని బహూకరించారు.

ముగ్గురిపై దాడి

మల్యాల, అక్టోబర్ 13: మండలంలోని ఓగులాపూర్‌కు చెందిన మెరుగు మనోహర్, మండల మహేశ్, మండల దినేశ్‌పై ఏడుగురు వ్యక్తులు కత్తులతో దాడి చేయగా తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు. మనోహర్ ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఏడుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.